## చిట్టి కథ




ఆమె చేతులు ఒణకసాగాయి.

గొంతులో తడి ఆరిపోయింది. మొఖం పాలిపోయింది. కళ్లు భయంతో కలవరపడ్డాయి.

ఫోన్ రిసీవర్ పట్టుకుని అలాగే నిలబడిపోయింది దివ్య.

ఏం జరిగింది? ఏం జరగబోతోంది? ఎలా? ఎవరు? ఎందుకు? ఈ ద్రోహం చేయబోయే వ్యక్తి ఎవరు?

ఎవర్ని హత్య చేయబోతున్నాడు?

# క్రాస్ టాక్

అసలు తనీవార్త ఎందుకు వినాల్సివచ్చింది?

జరిగింది... జరిగినట్టుగా ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంది.

అర్జంటు పనిమీద భర్తకి ఫోన్ చేద్దామని రిసీవర్ ఎత్తింది. కానీ... ఫోన్‌లో ఎవరో ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్న మాటలు వినిపించాయి. అది క్రాస్‌టాక్... తనకి అనవసరం. ఐనా కుతూహలం కొద్దీ చెవిఒగ్గి వినసాగింది.

"దావూద్... కరెక్టుగా పన్నెండు గంటలకి, ఆమెను గొంతు నులిమి 'ఫినిష్' చేసేయ్... ఆ తర్వాత నాకు వచ్చే ఆస్తిలో సగభాగం నీది" అని అస్పష్టంగా ఓ మగ గొంతు—మరో మగ గొంతుతో మాట్లాడుతున్న మాటలవి!

"ఎస్... సార్... పన్నెండు కొట్టేసరికి ఆమె ఈ లోకంలో వుండదు. డోంట్ వర్రీ" అని తాగి మాట్లాడుతున్నటుగా మరో గొంతు... ఎవర్ని చంపమని... ఎవరు చెబుతున్నారు? ఈ హత్య ఆపేదెట్లా? అసలు హత్య చేయబడే వ్యక్తికి ఈ విషయం తెలియచేసి, జాగ్రత్తగా వుండమంటే? అసలు ఆ వ్యక్తి ఎవరో తనకు తెలిస్తేగా? ఎలా ఆమెను హెచ్చరించటం? అని ఆలోచిస్తూ రిసీవర్ పెట్టేసి నెమ్మదిగా అడుగులేసుకుంటూ అటు—ఇటూ తిరగసాగింది దివ్య.

పోనీ... పోలీసులకు తెలియజేస్తే...?

మంచి ఆలోచన... వాళ్లే ఎలాగోలా కనుక్కుంటారు.

అనుకోకుండా తలెత్తి గడియారం వైపు చూసింది. పదకొండు నలభైఐదు...

మైగాడ్... ఇంకా పదిహేను నిమిషాలే వుంది.

ఒక గంతులో ఫోన్ దగ్గరకు వెళ్లి 100 ... అంకెను తిప్పింది. అటువైపునుండి ఎంగేజ్ శబ్దం వినిపించింది.

ఛట్... ఈ ఫోన్స్ అన్నీ ఇంతే... అవసరానికి ఎప్పుడూ దొరకవు!

టైం టకటక మంటూ పోతూవుంది.

పోలీస్ కొరకు ఆమె ప్రయత్నం చేస్తూవుంది.

సెకండ్స్ ముల్లు రోజుకంటే అతివేగంగా పరుగెత్తుతూ వున్నట్లుంది. ఎట్లా...?

ఓ మనిషి ప్రాణం కాపాడాలని తాను ఎంతో తపించిపోతూవుంటే ఎందుకో విధి ఎదురుతిరుగుతోంది.

మళ్లీ ప్రయత్నం చేద్దామనిపించి డయల్ మీద కుడిచేయి పెట్టి ఒకటో నెంబరు త్రిప్పబోతూవుండగా, ఆమె మెడమీద ఏదో క్రొత్తస్పర్శ.

మొరటుగా వున్న చేతివ్రేళ్ళు ఎవరివో ఆమె గొంతు చుట్టూ చుట్టుకోసాగాయి. ఊపిరి పీల్చుకోనివ్వకుండా బిగియసాగాయి... కఠినంగా మారిపోయి శక్తికొద్దీ గొంతు నులమసాగాయి.

ఏమిటి... ఏమి జరుగుతోంది!!

త్రాగిన వాసన గుప్పుమంటూ ఆమె ముక్కును బ్రద్దలకొట్టసాగింది. తనకు ఏదో కీడు జరగబోతోంది... తప్పించుకోవాలని ఎంతో ప్రయత్నం చేయసాగింది. చేతిలోని రిసీవర్ క్రింద పడింది. ప్రయత్నం విఫలమైంది. అతనిలోని పశురక్తం ఒక్కసారి ఉప్పొంగి చేతివేళ్లలోకి ప్రవహించి, ఆమె గొంతుమీద రాక్షసతాండవం చేయటంతో, ఆ శక్తి నుండి తప్పించుకోలేకపోతోంది. కనుగ్రుడ్లు పైకి రాసాగాయి.

ఏదో చెప్పాలని ప్రయత్నం... అందుకు అతను అవకాశం ఇవ్వడంలేదు. తన చేతులతో, ఆ కిరాతక వ్రేళ్ళను తప్పించాలని విఫలప్రయత్నం చేసింది. చిన్ననవ్వు వినిపించింది. కళ్లు పైకి ఎత్తి అటువైపు చూసింది.

"ఈ దావూద్ చేతులనుండి తప్పించుకోవాలనుకోవటం చాలా కష్టం"

'టంగ్... టంగ్" మని పన్నెండు గంటలు కొట్టింది గడియారం. అంటే క్రాస్‌టాక్‌లో చంపమంది ఎవర్నోకాదు.. తననే. అగ్నిసాక్షిగా మెడలో మంగళసూత్రం కట్టిన తనభర్తే తనని చంపమని చెప్పాడు. అతని గొంతు అప్పటి ఆలోచనలమధ్య గుర్తించలేదు కాని ఇప్పుడు గుర్తుకురాసాగింది. అవును పొరపాటు లేదు... తనని అతిప్రేమగా పలుకరించే గొంతు... అదే.

తను మరణిస్తే, తన పేరుమీదున్న నలభైలక్షల రూపాయిల ఆస్తికీ అతను వారసుడౌతాడు. అందుకే ఈ నికృష్టానికి ఒడిగట్టాడు. తాను ఎవర్నో అనుకొని, రక్షించాలని ఎంతో తపన పడింది. కానీ... ఇప్పుడు తనని రక్షించేందుకు ఎవరూ లేరు. ఆలోచనలు ఆగిపోయాయి. ఆమె తల వాలిపోయింది!

—చింతలపల్లి నాగలక్ష్మీరెడ్డి